క్లుప్తంగా

'ఆర్‌యూబీ' గుంతలకు మరమ్మతులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

సంగెం : 'అండర్ బ్రిడ్జి.. అడుగడుగునా గుంతలు' శీర్షికతో గత నెల 27న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. అధికారులు మండలంలోని ఎల్గూర్ రంగంపేట ఆర్‌యూబీలోని గుంతలకు గురువారం మరమ్మతు పనులు చేపట్టారు. తొలుత ఈనెల 11 వరకు రాకపోకలు నిలిపేశారు. గుంతలను తొలగించారు. నాణ్యతతో కూడిన రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే గుంతలకు రెండు సార్లు మరమ్మతులు చేపట్టిన క్రమంలో ఈసారైనా నాణ్యతతో రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రమశిక్షణతో సత్ఫలితాలు



సంగెం : క్రమశిక్షణతో చదివితే మెరుగైన సత్ఫలితాలు సాధించడం ఖాయమని గర్ల్ చైల్డ్ జిల్లా అధికారి (జీసీడీఓ) ఫ్లోరెన్స్ కోరారు. మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో వార్షిక పరీక్షలపై మాట్లాడారు. పరీక్షల పట్ల భయాందోళన అవసరం లేదన్నారు. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



వర్ధన్నపేట/రాయపర్తి : బీజేపీ నుంచి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా అంజిరెడ్డి గెలిచిన క్రమంలో ఆ పార్టీ నాయకులు వర్ధన్నపేట, రాయపర్తి మండల కేంద్రాల్లో గురువారం సంబురాలు నిర్వహించారు. టపాసులు పేల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మైస రాము, రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, మండల అధ్యక్షుడు నూనె అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు ప్రధానం

దుగ్గొండి : గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు ప్రధానమని డివిజనల్ పంచాయతీ అధికారి (డీపీఓ) రాజీవ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గిర్నిబావిలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లోనూ ఈనెల 10లోగా ఇంటి, నల్లా, ఇతర పన్నుల బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా ఇప్పటివరకు వసూలైన పన్నుల వివరాలను సమీక్షించారు. ప్రతిరోజూ ఉదయం వేళల్లో పన్నుల వసూలుకు వెళ్లాలని సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కొంకీస మదన్‌కుమార్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి వేర్వేరుగా నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు శీలం రాంబాబు, జుర్రు రాజుయాదవ్ తదితరులున్నారు.

ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు : ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ నర్సింగరావు అన్నారు. మండలంలోని నీరుకుళ్ల సబ్‌సెంటర్‌లో ఎన్‌సీడీ రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింగరావు మాట్లాడారు. 44 మంది బీపీ, 18 మంది డయాబెటిస్, 10 మంది జనరల్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. తగిన మోతాదు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్‌కుమార్, సాంబయ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

'జన్‌మన్‌రేగా'తో పారదర్శకత

● 'ఉపాధి'లో వివరాలు తెలుసుకునే అవకాశం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

నెక్కొండ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనేక సొబగులు దిద్దుకుంటోంది. ఉపాధి పనుల్లో పారదర్శకతకు అద్దం పట్టేలా అన్ని వివరాలు అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం తాజాగా 'జన్‌మన్‌రేగా' యాప్ తీసుకొచ్చింది. గతంలో పారదర్శకత కోసం బ్యాంక్, తపాలా ఖాతాల్లో కూలీల నగదు జమ చేసే చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. కాగా కొందరి ఖాతాల వివరాలు అనుసంధానం కాకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బందులు చోటు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సమగ్ర వివరాలు తెలుసుకునేలా కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను ఆవిష్కరించింది.

యాప్ పని తీరు ఇలా..

జాబ్ కార్డు కలిగిన కూలీలు స్మార్ట్‌ఫోన్‌లో జన్‌మన్‌రేగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో కూలీల హాజరు, నగదు జమ, విభాగం క్లిక్ చేస్తే సంబంధిత సమాచారం తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. కూలి జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అలాగే పథకంలో చేపట్టిన పనుల సమాచారం, స్థానిక అక్రమాలపై ఫిర్యాదులకు అవకాశం కూడా కల్పించారు. యాప్‌లో అన్ని భాషల్లో వివరాలు ఉండడం విశేషం.

అవగాహన అవసరం

ఇప్పటివరకు కూలీలు డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న విషయం తెలిసిందే. యాప్‌పై అవగాహన కల్పిస్తే కూలీలకు మరింత ప్రయోజనకరం ఖాయం. సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించేలా చొరవ చూపాలి.

యాప్‌ను వినియోగించుకోవాలి



జన్‌మన్‌రేగా యాప్‌ను కూలీలు వినియోగించుకోవాలి. ఉపాధి వివరాలు సొంతంగా కూలీలు మొబైల్ ద్వారా తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. స్థానిక అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం కూడా యాప్‌లో ఉంది.

– జాకబ్, ఈజీఎస్ ఏపీఓ, నెక్కొండ

బ్యాంకు మిత్ర సేవలు వినియోగించుకోండి



బ్యాంక్ మిత్ర సెంటర్‌లో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

● ఎస్సై వెంకటేశ్వర్లు, మేనేజర్ మోహన్‌రాజ్

దుగ్గొండి : బ్యాంకు మిత్ర సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మోహన్‌రాజ్ కోరారు. మండలంలోని మందపల్లిలో ఆ బ్యాంక్ మిత్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన పాస్‌బుక్ ప్రింటర్‌ను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా పాస్‌బుక్ ప్రింటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక లావాదేవీలకు మరింత భద్రత ఉంటుందని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఐరిక్స్ మేనేజర్ కొర్ర నర్సింహా, వీఓ అధ్యక్షురాలు మేదరి పద్మ, బ్యాంక్ మిత్రలు రౌతు సౌందర్య, మమత, అనురాధ, మహిళా సంఘాల బుక్ కీపర్ లింగాల సుమలత, బ్యాంక్ ఉద్యోగి చెల్పూరి విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల జాతరకు రాజకీయ ప్రభబండ్లు



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు కాంగ్రెస్ నాయకులు రాజకీయ ప్రభబండ్లను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 14న హోలీ పండుగ నుంచి జాతర ప్రారంభం కానుంది. గురువారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొమ్మాల స్టేజీ వద్ద 47 అడుగుల భారీ ఎత్తులో ఉండే ప్రభను నాయకుడు వీరగోని రాజ్‌కుమార్‌తోపాటు పలువురు సిద్ధం చేస్తున్నారు. ఇనుప పైపులతో ఏర్పాటు చేసిన ప్రభకు రంగులు వేసి కాగితాలు అతికించే, లైట్లు ఏర్పాటు చేసే పనుల కోసం ఇలా ప్రభను మోసుకుంటూ బయటకు తీసుకొచ్చారు.

వ్యక్తిత్వ వికాసంతోనే జీవితంలో ఉన్నతి

● 'సర్వోదయ' డైరెక్టర్ పల్లెపాడు దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

గీసుకొండ : వ్యక్తిత్వ వికాసం పెంచుకుంటేనే జీవితంలో ఉన్నతి సాధించగలరని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పల్లెపాడు దామోదర్ స్పష్టం చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ధర్మారం, గీసుకొండ గ్రామాల్లోని జెడ్పీ సెకండరీ స్కూళ్లలో 'మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు' అంశంపై గురువారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే బలహీనతలు ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ ఆసక్తి పెంచుకుని రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సాంబయ్య, హెచ్‌ఎం పట్టాభి, ఉపాధ్యాయులు విఠల్, పద్మ, రవిచందర్, ఫీల్డ్ ఆఫీసర్ అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై ఆకట్టుకున్నారు. గురువారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించగా డీఈఓగా వేముల రాంచరణ్, హెచ్‌ఎంగా తాళ్లపెల్లి దీక్షిత, ఉపాధ్యాయులుగా విస్సిక, కీర్తన పాల్, శ్యామల, మానస, నక్షత్ర, స్నేహిత, రక్షిత, సన్ని, వినీత్, చైత్ర, రాజేశ్, అరుణ్, సంజన, అటెండర్‌గా నర్సింహ, హర్షవర్ధన్, పీఈటీలుగా స్వామి, తరుణ్ వ్యవహరించారు. తరగతులు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంగోతు భద్రయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, యాకయ్య, రాజు, పావని, స్వామి, విష్ణు, సునిత, అక్షయ, వనిత, విజయ పాల్గొన్నారు.

బిప్స్‌లో 'ఫార్మా అన్వేషణ్–2025'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నర్సంపేట రూరల్ : ఫార్మసీ పితామహుడు ప్రొఫెసర్ ఎంఎల్.స్నూఫ్ జయంతి సందర్భంగా జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ (బిప్స్) కళాశాలలో గురువారం ఫార్మా అన్వేషణ్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. పీసీఐ ఈసీ మెంబర్ వెంకటరమణ, కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, నిట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీసీఐ ఈసీ మెంబర్ వెంకటరమణ మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో ఫార్మసీ రంగంలో ఇంక్యుబేషన్ సెంటర్లను అభివృద్ధి చేసి నూతన ఆవిష్కరణలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బిట్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ప్రోగ్రామ్ కన్వీనర్ మనీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

దుగ్గొండి : మండల కేంద్రంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మహేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య సమక్షంలో మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావుల దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షుడుగా కరుణ, కార్యదర్శులుగా కిషన్, వెంకటేశ్వర్లు, సభ్యులుగా నరేందర్, ఇంద్రసేనారెడ్డి, జిల్లా కౌన్సిలర్‌గా భద్రయ్య ఎన్నికయ్యారు.

బియ్యం, సరుకుల అందజేత



దుగ్గొండి : మండలంలోని స్వామిరావుపల్లికి చెందిన కూచన రాజ్యలక్ష్మిని ఇటీవల ఆమె భర్త, కుమారుడు వేర్వేరుగా మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు ఒలిగె నర్సింగరావు, డ్యాగం శివాజీ, తదితరులు గురువారం పరామర్శించారు. అనంతరం నాయకులు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కూరతోట సురేశ్, ఎడెల్లి శ్రీనివాసరెడ్డి, నాగరాజు, నరేశ్, శ్రీకాంత్, దాసరి రాజు, అనంతరావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులాలన్నింటికీ న్యాయం చేయాలి



డప్పు ప్రదర్శన ఇస్తున్న మహేందర్, నాయకులు

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ నివేదికలో ఉన్న లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్, రమేశ్, రాజశేఖర్ మాట్లాడారు. క్యాబినెట్ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు దామెర కిషోర్, నాయకులు రాజు, లవకుమార్, మల్లయ్య, లక్ష్మీనారాయణ, సురేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలో ట్రాలీ ఆటో ప్రమాదానికి గురై గాయాలపాలైన వారిని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు భూక్య సమ్మయ్య, ఈసంపల్లి బాబు గురువారం వేర్వేరుగా పరామర్శించారు. కూలీలతో వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు చెప్పారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

బురహన్‌పల్లిలో..

రాయపర్తి : మండలంలోని బురహన్‌పల్లికి చెందిన ముత్తారపు రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత రాములు చిత్రపటానికి దయాకర్‌రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపెల్లి రమేశ్, ముంజాల రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన చింతకాయల రాజశేఖర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, డివిజన్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో దాతల సహకారంతో గురువారం రూ.52500 ఆర్థికసాయం అందజేశారు. సదరు డబ్బును పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి బాండ్‌ను బాధిత కుటుంబానికి రవీందర్, యాదగిరి అందజేశారు. అనంతరం రవీందర్ మాట్లాడారు. పేద కుటుంబాలను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదుకుంటున్నట్లు తెలిపారు. అలాగే రాజశేఖర్‌తో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు రూ.18 వేల సాయం అందజేశారు. కార్యక్రమాల్లో అసోసియేషన్ నాయకులు దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, పొన్నం రాజు, పెండ్యాల కృష్ణ, పిట్టల కుమార్, శ్యామ్, పెండ్యాల సదానందం, నీరటి రాజు, చింతకాయల సతీశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

గీసుకొండ : కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప ఆధ్వర్యంలో మండలంలోని ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకలకు రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కేంద్రంలో పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల సంక్షేమమే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకుని మహిళలు సాధికారత సాధించాలని కాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గందె కల్పన, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు కూరపాటి రాధిక, సైకియాట్రిస్ట్ డాక్టర్ రాధిక, సీనియర్ నాయకులు తక్కలపల్లి శ్రీదేవి, మంజులారెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో విద్యార్థుల పాత్ర కీలకం

● ఎస్పీ నాగరాజు



మాట్లాడుతున్న ఎస్పీ నాగరాజు

నర్సంపేట : సమాజంలో విద్యార్థుల పాత్ర కీలకమని డీజీపీ కార్యాలయ ఎస్పీ నాగరాజు, సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రేరణ కార్యక్రమాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఫలితాల సాధనలో విద్యార్థులు చదువుకునే పద్ధతుల ప్రభావం ఉంటుందని చెప్పారు. జ్ఞాపకశక్తి పెంచుకోవడం, మెళకువలు పాటించడం, ఒత్తిడిని అధిగమించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాంతారావు, ఉపాధ్యాయులు రాజేశ్, వాణి, శౌరి, సురేశ్, రాజమౌళి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో విద్యార్థుల అధ్యయనం



విద్యార్థులతో కూసం రాజమౌళి, సరోజన, తదితరులు

గీసుకొండ : జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లిలో హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన డఫోడిల్స్ హైస్కూల్‌లో 6, 7వ తరగతుల విద్యార్థులు గురువారం అధ్యయనం చేశారు. మండలంలోని ఆ గ్రామ అభివృద్ధి 6వ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశంగా ఉన్న క్రమంలో విద్యార్థుల ఆకాంక్ష మేరకు స్కూల్ నిర్వాహకులు ఒకరోజు ప్రాజెక్ట్ వర్క్‌గా చేపట్టారు. గంగదేవిపల్లికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఎందుకు వచ్చిందన్న అంశాలపై విద్యార్థులకు ప్రశ్నాపత్రం అందజేసి సరైన సమాధానాలు రాసిన విద్యార్థులకు వార్షిక పరీక్షలో 5 మార్కులు వేయనున్నట్టు ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. గ్రామానికి చేరుకున్న విద్యార్థులకు గ్రామం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి గల కారణాలను, చేపట్టిన అభివృద్ధిని, ప్రజల సమన్వయాన్ని జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధి గూడ సరోజన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రబెల్లిపై విమర్శలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

పర్వతగిరి : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దయాకర్‌రావు ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా గెలిచి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. దయాకర్‌రావు హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. ప్రస్తుత వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు నాగరాజు, యశస్వినిరెడ్డి కనీసం ఎండిన పంటలను కూడా పరిశీలించలేదని తెలిపారు. నాయకులకు చిత్తశుద్ధి ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, నాయకులు నర్సింగం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పోస్టు కార్డులను ప్రదర్శిస్తున్న రజనీకాంత్, ఉద్యమకారులు

ఖానాపురం : తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఫోరం ఆధ్వర్యంలో గురువారం పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా రజనీకాంత మాట్లాడారు. ఉద్యమకారుల పోరాట ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించి తొలుత బీఆర్‌ఎస్, అనంతరం కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చాయని చెప్పారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం విస్మరించగా, ప్రస్తుత ప్రభుత్వం సైతం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల సానుకూలంగా స్పందించాలని ఆకాంక్షించారు. ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీని వేయడంతోపాటు ఇంటి స్థలం, పెన్షన్, తదితర హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం మండల అధ్యక్షుడు వీరమళ్ల రాములు, నాయకులు కందికట్ల జయ, వల్లెపు శ్రీనివాస్, వంగ గణేష్, తదితరులు పాల్గొన్నారు.